

ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

పార్వతీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్లను ఒకరోజు ముందుగానే శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామాల్లో లబ్ధిదారులు అందుబాటులో ఉండాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సెప్టెంబరు 2న పింఛన్లు పొందవచ్చునన్నారు. జిల్లాలో 1.42లక్షల మందికి రూ.59.37 కోట్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

గోతులు.. కోతలు

- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- ఐదేళ్లూ ఎలాంటి మరమ్మతులు చేపట్టని వైనం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



కోతకు గురైన పిన్నింటి రామినాయుడువలస ప్రధాన రహదారి



ఉల్లిభద్ర సమీపంలో గుంతల వద్ద వాహనదారులను అప్రమత్తం చేసేందుకు రాళ్లు పెట్టిన దృశ్యం

గరుగుబిల్లి/పార్వతీపురం టౌన్/పాచిపెంట, ఆగస్టు 29: జిల్లాలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. తుఫాన్ కారణంగా బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కోతకు గురై పూర్తిగా దెబ్బతిన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గోతులు ఏర్పడి రాళ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం -పాలకొండ ప్రధాన రహదారి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. పార్వతీపురం మండలం అడ్డాపుశీల సమీపంలో రోడ్డు భారీగా కోతకు గురైంది. ఉల్లిభద్ర రహదారి అడుగడుగునా గోతులతో దర్శనమిస్తోంది. ఈ గోతుల్లో ఎర్ర జెండాలు, చిన్నపాటి రాళ్ల హెచ్చరికలుగా ఏర్పాటు చేసుకున్న పరిస్థితి ఏర్పడింది. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురైన పిన్నింటిరామినాయుడువలసకు వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో బ్యాలెట్ బాక్సుల తరలింపు, ఓట్లు లెక్కింపునకు అప్పట్లో ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలకు రహదారిని ఏర్పాటు చేశారు. ఈ రహదారి ఏర్పాటు చేసిన కొద్ది నెలలకే పలు చోట్ల కోతకు గురైంది. అప్పటి నుంచి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, ప్రజలకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. చీకటి పడిందంటే ఈ మార్గంలో ప్రయాణం నరకంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న గోతుల్లో వర్షపు నీరు చేరింది. దీంతో గోతులు కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాచిపెంట మండలంలోని పలు గ్రామీణ రోడ్లు వర్షాలకు బురదమయంగా మారాయి. పాచిపెంట మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన మెటీరియల్ తీసుకెళ్తున్న వాహనాలతో కొటికిపెంట, తదితర గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. దీనిపై గురువారం సీపీఎం మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గత ఐదేళ్లలో ధ్వంసమైన రోడ్లను కూటమి ప్రభుత్వం బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అడ్డాపుశీల సమీపంలో రహదారికి ఆనుకుని ఏర్పడిన గొయ్యి

ప్రతిపాదనలు పంపించాం...

జిల్లా కేంద్రం పార్వతీపురం పరిధిలోని ప్రధాన రహదారి మరమ్మతుల కోసం రూ.2 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం

-అప్పాజీ, డీఈ, ఆర్అండ్‌బీశాఖ



కొటికిపెంట సమీపంలో బురద రహదారిపై నిరసన తెలుపుతూ..



కొత్తవలస ప్రధాన రహదారిపై గోతులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

- డీఎంహెచ్‌వో విజయపార్వతి

సీతంపేట రూరల్, ఆగస్టు 29: సీతంపేట ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయపార్వతి ఆదేశించారు. మండలంలోని కుసిమి, దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్‌లు, డ్రగ్ స్టోర్లను పరిశీలించారు. మందులు అన్ని అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులు భానుప్రసాద్, చాందినీలకు సూచించారు. పాము, కుక్కకాటు ఇంజక్షన్‌లు తప్పనిసరిగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌పై వివాదం

- మా పరిధి అంటున్న ఒడిశా
- కాదు మాదంటున్న ఏపీ అధికారులు
- దిమ్మిడిజోల సమీపంలోని రీచ్‌పై ఎవరి వాదన వారిది
- సమస్య పరిష్కారం కాక వెనుదిరిగిన వైనం

భామిని, ఆగస్టు 29: ఆంధ్రా, ఒడిశా మధ్య ఇప్పటికే వంశధార నదీ జలాల వివాదం నడుస్తోంది. ఇది సుప్రీం కోర్టులో ఉంది. ఇప్పుడు తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దులోని దిమ్మిడిజోల ఇసుక రీచ్‌పై వివాదం రేగింది. ఆ ఇసుక రీచ్ తమ పరిధి అంటే తమ పరిధి అంటూ ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇరు వర్గాలూ వెనుదిరిగాయి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని దిమ్మిడిజోల వద్ద వంశధార నదీ తీరంలో ఇసుక తవ్వకాలకు ఒడిశా ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో ఆ ర్యాంపు నుంచి గత నెల 29న కాంట్రాక్టర్లు ఇసుక తరలిస్తుండగా స్థానికులు మన్యం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాలకొండ ఆర్డీవో వీవీ రమణ ఆ రీచ్‌ను సందర్శించారు. మ్యాప్‌ల ద్వారా ఆంధ్రా భూ భాగమని నిర్ధారించి ఇసుక తరలించవద్దని కాంట్రాక్టర్లకు సూచించారు. దీంతో నెల రోజుల పాటు ఇసుక తరలింపు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో గురువారం ఒడిశా అధికారులు భారీ బందోబస్తుతో రీచ్ వద్దకు చేరుకున్నారు. ర్యాంప్ ఒడిశా భూభాగం బూదర గ్రామ పరిధిలో ఉందని పర్లాకిమిడి సబ్ కలెక్టర్ అనూప్‌పండా, కాశీనగర్ తహసీల్దార్ అశోక్ ప్రధాన్ మ్యాప్‌ల ద్వారా ఆంధ్రా అధికారులకు వివరించారు. ఒడిశా భూ భాగంలోనే ఇసుక ర్యాంప్ నడుస్తుందని బుకాయించారు. అయితే పాలకొండ ఆర్డీవో వీవీ రమణ, సర్వేయర్ వెంకటరావు తమ పరిధిలో ఉన్న మ్యాప్‌లను చూపించారు. లివిరి రెవెన్యూ గ్రామంలో 333 సర్వే నెంబర్‌లో 579 ఎకరాలు నదీ తీరంలో ఉందని వివరించారు. 1974లో ఇరు రాష్ట్రాల ఉమ్మడి సెటిల్‌మెంట్‌లో ఉందని పేర్కొన్నారు. అయితే, ఆంధ్రా భూభాగంలో 579 ఎకరాల విస్తీర్ణాన్ని రెండు భాగాలుగా చేసి 1994లో మళ్లీ సెటిల్‌మెంట్ సర్వే అయిందని ఒడిశా అధికారులు, ఆంధ్రా అధికారులకు మ్యాప్‌ల ద్వారా వివరించారు. అయితే తమ వద్ద ఆ వివరాలు లేవని, సెటిల్‌మెంట్ అయి ఉంటే ప్రొసీడింగ్ కాపీలు అందజేయా లని పాలకొండ ఆర్డీవో ఒడిశా అధికారులకు కోరారు. మూడు రోజుల్లో సెటిల్‌మెంట్ కాపీలను అందజేస్తామని చెప్పి వారు వెళ్లిపోయారు. జిల్లా అధికారులకు కూడా వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, సర్వేయర్ రాజశేఖర్, ఆర్ఐ ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇరు రాష్ట్రాల అధికారులు

రూ.70 కోట్లతో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి

- మంత్రి సంధ్యారాణి



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాష్ట్రమంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్, ఆగస్టు 29: రాష్ట్రంలో సాక్ష్యం జన్‌మన్ పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రూ.70 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆమె ఢిల్లీలో గురువారం కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖామంత్రి అన్నపూర్ణాదేవిని కలిసి రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం పలు వినతులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. సాక్ష్యం పథకంలో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులకు మ్యాచింగ్‌గా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. అదే విధంగా గిరిజన ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కేంద్రం మరో రూ.20 కోట్లు కేటాయించిందన్నారు. డబుల్ పోర్టల్‌లో ఫేషియల్ రికగ్నేషన్ ప్రోగ్రామ్‌ను ఒకే పోర్టల్ ద్వారా చేస్తే ఉద్యోగులకు పనిభారం తగ్గుతుందని సూచించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న బాలామృతం ఇక్కడే తయారీకి ప్రతిపాదించామన్నారు. ఏపీ విభజన తదుపరి బాలామృతం తయారీ కేంద్రం తెలంగాణలో ఉండిపోయిందన్నారు. ఈ బాలామృతం దిగుమతికి తెలంగాణకు ప్రతి ఏటా రూ.240 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి మన రాష్ట్రంలోనే ఈ బాలామృతం తయారీకి యోచిస్తున్నామన్నారు. ఏపీ ఫుడ్స్ ఫ్యాక్టరీ పెట్టి తయారీకి ప్రతిపాదించామన్నారు. ఇందుకు రూ. 80 కోట్లు అవసరమని ప్రతిపాదిస్తే కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆమె వెంట మహిళా,శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సూర్యకుమారి ఉన్నారు.

ఆత్మలకు పింఛన్లు

- పిల్లలున్నా ఒంటరి మహిళలేనట
- భర్తలు ఉన్నా వితంతువులేనట
- వీరికి కూడా పింఛన్లు ఇచ్చేశారు
- ఉపాధి పనుల్లో సైతం అవకతవకలు
- సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం
- ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్.. ఏపీవోకు షాకాజ్ నోటీసు

వీరఘట్టం, ఆగస్టు 29: వారికి పిల్లలు ఉన్నా ఒంటరి మహిళల పేరిట పింఛన్లు పొందారు. అలాగే భర్తలు ఉన్నా వితంతువుల కింద పింఛన్ డబ్బులు అందుకున్నారు. చివరకు చనిపోయిన వారి ఖాతాల్లో కూడా పింఛన్ల సొమ్ము జమ చేసేశారు. ఉపాధి పనులకు వెళ్లపోయినా వేతనాలు చెల్లించేశారు. ఇలా అన్నింటా వీరఘట్టం మండలంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇవన్నీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతమయ్యాయి. వీరఘట్టం మండల పరిషత్ కార్యాలయంలో నీటి యాజమాన్య ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన 825 రకాల ఉపాధి పనులకు సంబంధించి ఆయన వివరాలు వెల్లడించారు. వేతనాల రూపంలో కూలీలకు రూ.16.99 కోట్లు పైగా చెల్లించినట్లు చెప్పారు. మెటీరియల్ కింద రూ.19.4 లక్షల బిల్లును చెల్లించినట్లు తెలిపారు. 31 పంచాయతీరాజ్ పనులకు రూ.1.93 కోట్లు, మెటీరియల్ కింద రూ.45 వేలు, 13 ఐటీడీఏ పనులకు రూ.1.79 కోట్లు, రెండు ఎస్ఎస్ఏ పనులకు రూ.1.52లక్షలు, నాలుగు ఆర్‌డబ్ల్యుఎస్ పనులకు రూ.34 లక్షలు మొత్తం 875 పనులకు సంబంధించి వివిధ రూపాల్లో రూ.21.28 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పింఛన్లకు సంబంధించి ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు చనిపోయిన 109 మంది బ్యాంకు ఖాతాలకు రూ.1.14లక్షలు జమ చేసినట్లు గుర్తించామన్నారు. 46 మంది డప్పు కళాకారులకు రూ.8.25లక్షలు చెల్లించారని, వీరికి ఏ విధమైన గుర్తింపు కార్డులు లేవని చెప్పారు. 20 మంది ఒంటరి మహిళలకు రూ.60 వేల వరకు చెల్లించారని, వీరికి కూడా ఏ విధమైన గుర్తింపు కార్డులు లేవని, పైగా పిల్లలు ఉన్నారని తెలిపారు. అలాగే 24 మంది మహిళలకు భర్తలు ఉన్నప్పటికీ వితంతు పింఛన్ కింద రూ.72 వేలు అందించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోయినా తొమ్మిది మంది చర్మకారులకు రూ.25 వేలు చెల్లించారని తెలిపారు. కంబర పంచాయతీలో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని, తప్పుడు మస్తర్లు వేసి టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ వేతనాలు పొందారని చెప్పారు. అలాగే వేతనదారుల నుంచి ప్రతీ వారం రూ.100 చొప్పున వసూలు చేసినట్లు తేలిందన్నారు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అలాగే, ఏపీవో జి.సత్యం నాయుడుకు షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి: కలెక్టర్




ఛాయాచిత్ర ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం గిడుగు వెంకటరామ్మూర్తిపంతులు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. వ్యవహారిక భాషాభివృద్ధికి కృషి చేసిన మహానుభావుడు గిడుగు అని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంవీఆర్ కృష్ణాజీ, జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ, జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, డీపీఆర్‌వో రమేష్, తెలుగు ఉపాధ్యాయుడు తేజోమూర్తుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

తుంపెర సేద్యం: లబ్ధిదారులకు నిధుల విడుదల

పార్వతీపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో తుంపెర సేద్యం చేస్తున్న 750 మంది లబ్ధిదారులకు రూ.53.79 లక్షల నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్కువ నీటి వనరులతో వ్యవసాయం చేసేందుకు తుంపెర పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన సబ్‌ప్లాన్ మండలాల్లోని రైతులకు 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు తరఫున 45 శాతం రాయితీపై పరికరాలు అందిస్తామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం • శుక్రవారం • 30 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



రజనీకాంత్ చిత్రంలో నాగార్జున

రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'కూలీ' చిత్రంలో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. ఇందులో ఆయన పోషిస్తున్న సైమన్ పాత్రను పరిచయం చేస్తూ యూనిట్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్న మరో చిత్రం 'కుబేర' నుంచి ఆయన స్టైలిష్ లుక్‌ను విడుదల చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మగవాళ్లనూ వదల్లేదు

• దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై తాజా ఆరోపణ

మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక పరిశ్రమను కుదిపేస్తోంది. తాజాగా మరి కొందరు మలయాళ సినీ ప్రముఖులపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. నటి మిను మునీర్ ఆరోపణలతో బుధవారం నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముఖేశ్, హీరో జయసూర్యపై అత్యాచారం కేసు నమోదు చేశారు. వీరితో పాటు మరో ఐదుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఇప్పటివరకూ 17 మందిపై కేసులు నమోదయ్యాయి.

అవకాశం ఇస్తానని...

మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ తనను లైంగికంగా వేధించాడని బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే అతను ఆడవాళ్లనే కాదు మగవాళ్లనూ వదల్లేదు అని కోజికోడ్‌కు చెందిన సజీర్ అనే వ్యక్తి సంచలన ఆరోపణలు చేశాడు. తనపైన 2012లో రంజిత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సజీర్ కేరళ డీజీపీకి ఫిర్యాదు చేశాడు. "సినిమా అవకాశం ఇస్తానని చెప్పి బెంగళూరులోని తాజ్ హోటల్‌కు అర్ధరాత్రి పిలిపించుకున్నాడు. గదిలోకి వెళ్లాక నా దుస్తులు తొలగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నా ఫొటోలు తీశాడు. 'వాటిని ఎవరికి పంపావు' అని అడిగితే 'లోపలి గదిలో నటి రేవతి ఉన్నారని రంజిత్ నాతో చెప్పాడు. అయితే ఆమె నిజంగా అక్కడ ఉన్నారా? లేదా, వారిద్దరి మధ్య ఎలాంటి సంబంధం ఉందనేది నాకు తెలియదు' అని సజీర్ చెప్పాడు.

పృథ్వీరాజ్ తగిన వ్యక్తి

అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు నిర్వహించేందుకు హీరో పృథ్విరాజ్ సుకుమారన్ తగిన వ్యక్తి అని నటి మినుమునీర్, పార్వతి తిరువోతు అభిప్రాయపడ్డారు. అమ్మ ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ మూకుమ్మడి రాజీనామాపై నటి పార్వతి తిరువోతు స్పందించారు. అసోసియేషన్‌లో నిరంకుశ పాలన నడుస్తోందని ఆరోపించారు. మీడియా ముందుకొచ్చి మాట్లాడే అవకాశం లేక పోవడంతోనే రాజీనామా చేశామన్నారు. తమ నిర్ణయం పిరికితనంగా అనిపించిందన్నారు. ఇంతమంది మహిళలు ధైర్యంగా బయటకొచ్చి ఫిర్యాదు చేస్తున్నా కేరళ ప్రభుత్వం విచారణలో నిర్లక్ష్యం చూపుతోందని మిను ఆరోపించారు.

కోలీవుడ్‌లోనూ కమిటీ

'అడ్జెస్ట్‌మెంట్' పేరుతో సినిమా అవకాశాలు ఇస్తామని గాలం వేసేవారు ఎంతటివారైనా చెప్పుతో కొట్టాలని 'నడిగర్ సంఘం' ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ పిలుపునిచ్చారు. జస్టిస్ హేమ కమిషన్ తరహాలోనే కోలీవుడ్‌లోనూ నడిగర్ సంఘం ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం అని చెప్పారు.



హేమ కమిటీకి సమంత ప్రశంసలు

మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికితేవడంలో హేమ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని టాలీవుడ్ కథానాయిక సమంత ప్రశంసించారు. అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కారణమైన డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) సంస్థనూ ఆమె అభినందించారు. ఆ సంస్థ సభ్యుల కష్టం వల్లే ఈ రోజు మహిళల సమస్యలు చర్చనీయాంశంగా మారాయని చెప్పారు. సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ కోసం ఆ సంస్థ అవిశ్రాంతంగా పాటుపడుతోందని అభినందించారు. 'డబ్ల్యూసీసీ గురించి నాకు చాలా కాలంగా తెలుసు. ప్రభుత్వం హేమ కమిటీ ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ తీసుకొన్న చొరవే కారణం. వారి పోరాటానికి నా కృతజ్ఞతలు' అన్నారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6tDC2Mxలో చదవండి.

నవరస నటనకు యాభై ఏళ్లు!



ఎన్టీఆర్ వంటి మహా నటుడికి వారసుడు కావడం ఒక విధంగా బాలకృష్ణ అదృష్టం, మరో రకంగా అగ్నిపరీక్ష కూడా. తండ్రి పేరు నిలబెట్టి ఆ విషయంలో విజయం సాధించారు బాలకృష్ణ. యాభై ఏళ్లక్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైన 'తాతమ్మ కల'(1974 ఆగస్టు 30) చిత్రంతో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. సాధారణంగా 30 ఏళ్లో, నలభై ఏళ్ల కాలమో కథానాయకుడిగా నటించి, ఆ తర్వాత క్యారెక్టర్ పాత్రలకు షిఫ్ట్ అయిన నటులు ఎందరో! కానీ బాలకృష్ణ విషయం చాలా ప్రత్యేకం. తొలి సినిమా 'తాతమ్మ కల' నుంచి ఇప్పటి వరకూ ఒక్క ఏడాది కూడా గ్యాప్ తీసుకోకుండా హీరోగానే నటిస్తూ యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించారు బాలకృష్ణ. సెప్టెంబర్ ఒకటిన దక్షిణాది చిత్ర పరిశ్రమలోని అతిరథ మహారథుల సమక్షంలో ఆయనకు భారీ సన్మానం జరుగుతున్న నేపథ్యంలో ఆయన కెరీర్‌లో మలుపులు, మెరుపులు....

ప్రపంచ వ్యాప్తంగా ఎందరో నటీనటులు తమ వారసుల్ని వెండితెరకు పరిచయం చేశారు. ఆ సంప్రదాయాన్ని మన దేశంలో మహా నటుడు పృథ్విరాజ్ కపూర్ అనుసరించారు. ఆయన తనయులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ తండ్రి లాగానే నటనను వృత్తిగా స్వీకరించి తమదైన బాణీ పలికించారు. రాజ్ కపూర్ కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకొని తన ముగ్గురు కొడుకుల్ని హీరోలుగా పరిచయం చేశారు. దక్షిణాది మహా నటుడు నందమూరి తారకరామారావు ఈ విషయంలో రాజ్ కపూర్‌ను అనుసరిస్తూ తొలిసారిగా తెలుగు నాట తన తనయులు హరికృష్ణ, బాలకృష్ణను నటనా రంగంలో అడుగు పెట్టేలా ప్రోత్సహించారు. అయితే నట వారసుల్లో ఎవరికీ లేనంత సుదీర్ఘమైన కెరీర్ బాలకృష్ణ సొంతం.

- బాలకృష్ణ నటించిన తొలి చిత్రం 'తాతమ్మ కల'కు కూడా కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కుటుంబ నియంత్రణ విధానాన్ని దేశంలో తొలిసారిగా ప్రవేశ పెట్టినప్పుడు ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ నిర్మించిన సినిమా ఇది. యాభై రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న తర్వాత సినిమాను ఆపేసి, చిన్న చిన్న మార్పులతో మళ్లీ విడుదల చేశారు. రెండు సార్లు సెన్సార్ అయి, రెండు సార్లు విడుదల అయిన సినిమా తెలుగులో ఇదొక్కటే. ఇందులో బాలకృష్ణది బాలనటుడి పాత్ర కాదు. కథలో కీలకమైన పాత్ర.
- ఎన్టీఆర్ అనితర సాధ్యంగా అభినయించిన శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను బాలకృష్ణ సైతం పోషించి అభిమానుల్ని అలరించారు. అంతే కాదు ఎన్టీఆర్ పోషించని అభిమన్యు, నారద, ఆంజనేయ పాత్రలను బాలకృష్ణ పోషించి అభినందనలు అందుకున్నారు. పెద్దాయన పాతాళ భైరవి వంటి జానపద చిత్రాల్లో నటిస్తే, బాలయ్య భైరవ ద్వీపం సినిమాతో అభిమానులను ఆకట్టుకున్నారు.
- ఒకే చిత్రంలో అటు భగవంతుడు, ఇటు భక్తునిగా నటించిన ఘనత తెలుగు నాట ఎన్టీఆర్, బాలకృష్ణ దే. 1964లో వచ్చిన 'శ్రీ సత్యనారాయణ మహత్మ్యం' లో ఎన్టీఆర్ శ్రీ మహా విష్ణువుగా, సత్యవ్రతుడిగా నటించారు. అలాగే 'పాండురంగడు' లో బాలయ్య శ్రీకృష్ణ, పుండరీక పాత్రలతో మెప్పించారు.
- బాలకృష్ణ ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో కాలేదు. ఆయన నటిస్తేనే అది ట్రెండ్ అయింది. ఆ ట్రెండ్‌ను తర్వాత మిగిలిన హీరోలందరూ ఫాలో కావడం గమనార్హం. డిస్కో డ్యాన్సులు, మెషిన్‌గన్స్‌తో యాక్షన్ సినిమాలు వస్తున్న రోజుల్లో బాలకృష్ణ పంచె కట్టుతో, కర్ర సాముతో బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించారు. ఆ తర్వాత చాలా కాలం తెలుగులో గ్రామీణ వాతావరణంలో సినిమాలు వచ్చాయి. అలాగే తెలుగులో ఫ్యాక్షన్ సినిమాల నిర్మాణం బాగా పెరగడానికి బాలకృష్ణ నటించిన 'సమరసింహా రెడ్డి', 'నరసింహనాయుడు' చిత్రాల సంచలన విజయమే కారణం.
- ఎన్టీఆర్ తన 52 వ ఏట బాపు దర్శకత్వంలో రూపొందిన శ్రీరామాంజనేయ యుద్ధం చిత్రంలో శ్రీరామునిగా నటించారు. అలాగే బాలకృష్ణ కూడా తన 52 వ ఏటనే అదే బాపు దర్శకత్వంలో శ్రీరామరాజ్యం చిత్రంలో శ్రీరామునిగా నటించడం విశేషం.
- తండ్రి పేరుతో తీసిన బయోపిక్ లో తనయుడు హీరోగా నటించిన సందర్భాలు గతంలో లేవు. అరుదైన ఆ ఘనత బాలయ్య కే దక్కింది. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు, మహానాయకుడు చిత్రాల్లో బాలయ్య ఎన్టీఆర్ గా కనిపించడంతో అభిమానులు మురిసిపోయారు.
- రాజకీయ నాయకునిగా కూడా తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారు బాలకృష్ణ. మూడు సార్లు హిందూపరం శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ ప్రజా సేవలోనూ తన ముద్రను చాటారు.

ఇప్పటివరకూ రాని సినిమా



హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలీ 'రాజ రాజ చోర' చిత్రం తర్వాత కలసి చేస్తున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో రాజు, భవభూతి, సింగ, యయాతి పాత్రలను శ్రీవిష్ణు, రాణి రుక్మిణీదేవి పాత్రలో రీతూ వర్మ నటించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ ' మన అందరి ఇళ్లలో ఉన్న పాయింటే అయినా ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటివరకూ రాని సినిమా ఇది. ఇలాంటి సినిమా తీయడానికి ముందుకు వచ్చిన విశ్వప్రసాద్ గారికి కృతజ్ఞతలు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అన్నారు. 'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి ఇంతకుముందు 'రాజ రాజ చోర' సినిమా చేశాం. 'శ్వాగ్' చాలా విభిన్న చిత్రం' అని తెలిపారు విశ్వప్రసాద్. దర్శకుడు హసిత్ గోలీ మాట్లాడుతూ 'ఇది అచ్చ తెలుగు సినిమా. కంటెంట్ చాలా మాట్లాడుతుంది. తాత, ముత్తాతలతో కలసి చూడగలిగే సినిమా. విష్ణు బాగా చేశారు. ఎప్పటికీ గుర్తుండి పోయే సినిమా అవుతుంది' అన్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ తదితరులు నటించారు.

ఐదు భాషల్లో 'కుంభ'



స్వీయ దర్శకత్వంలో వి.సముద్ర నిర్మించే 'కుంభ' చిత్రం గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. హీరో విజయ్‌రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత డీఎస్ రావు తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు చంద్రమహేశ్, దేవిప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. 'కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో ఐదు సినిమాలు తీస్తున్నాను. వాటిల్లో 'కుంభ' ఒకటి. ఐదు భాషల్లో ఈ సినిమా తయారవుతుంది' అని సముద్ర చెప్పారు. విజయ్‌రామ్ హీరోగా, సూరజ్ ఆదిత్య విలన్‌గా నటిస్తున్నారు.



తెలుగు భాషా దినోత్సవం రోజున...

కొత్తగా...

ఎప్పటినుంచో తెలుగు భాష, సంస్కృతి, విలువల గురించి సినిమా తీయాలనే కోరిక ఉంది. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలు ఉన్న అంశాలు కలిగిన కథ దొరికినప్పుడే అలాంటి సినిమా చేయాలి. ఇప్పుడు అటువంటి కథ కుదిరింది. 1980 నేపథ్యంలో జరిగే సినిమా ఇది. తెలుగు భాషా దినోత్సవం రోజున ఈ సినిమా వివరాలు ప్రకటించడం ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు వైవీఎస్ చౌదరి. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు నందమూరి తారక రామారావు హీరోగా, వీణా రావు హీరోయిన్‌గా నటించనున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా చౌదరి ఆయనకు నివాళులు అర్పించారు. చిత్ర ఎగ్జిక్యూటివ్ నిర్మాత రమేశ్ అత్తిలిని చౌదరి ఈ సందర్భంగా పరిచయం చేశారు. 'మేం నలుగురం స్నేహితులం కలసి చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాలని అనుకున్నాం. చౌదరిగారితో కలసి ఈ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది' అన్నారు రమేశ్ అత్తిలి. ఈ కార్యక్రమంలో నిర్మాత యలమంచిలి గీత, మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

ట్రైబల్ యూనివర్సిటీ పనులు వేగవంతం చేయండి

● కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: మెంటాడ వద్ద నిర్మించ తలపెట్టిన ట్రైబల్ యునివర్సిటీకి సంబంధించిన అప్రోచ్‌రోడ్డు, విద్యుత్, నీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పన వేగంగా జరగాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ తమ చాంబర్‌లో ట్రైబల్ యూనివర్సిటీ పనులపై సమీక్షించారు. భూసేకరణ సమస్యను రెండురోజుల్లో పరిష్కరించాలని, కోర్టులో ఉన్న మూడు ఎకరాల భూమికి సంబంధించి కక్షిదారులతో సంప్రదించి ఒప్పించాలని బొబ్బిలి ఇంచార్జి ఆర్డీవో సుధారాణికి సూచించారు. సక్రమ, అక్రమ , ఆక్రమణలో ఉన్న భూమి వివరాలు, భూసేకరణకు ఎంతమొత్తం అవసరం అవుతుంది, మొత్తం భూమి వివరాలను వర్గీకరించి రెండురోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆర్డీవోకు సూచించారు. మార్చి 2025లో తరగతి గదులు ప్రారంభించా ల్సి ఉన్నందున నిధులు మంజూరైన మర్నాడే పనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి సరఫరాకు సంబంధించి రూ.6 కోట్ల విలువైన పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులు పూర్తిచెయ్యటానికి, పూర్తి అయిన పనులకు బిల్లులు చెల్లించుటకు ప్రతిపాదనలు పంపాలని ఎస్.ఈ ఉమాశంకర్‌కు ఆదేశించారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి సర్వీసు కనెక్షన్‌కు అవసరమయ్యే నిధుల కోసం వెంటనే అంచ నాలు పంపాలని విద్యుత్ శాఖ అధికారి లక్ష్మణ్‌రావు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆ ర్వో సుమబాల, ట్రైబల్ యూనివర్సిటీ రిజి స్ట్రార్ టి.శ్రీనివాసన్, మెంటాడ, దత్తిరాజేరు తహ సీల్దార్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

గంజాయి స్వాధీనం

● నిందితుల అరెస్టు

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే పాత క్వార్టర్స్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న పది మంది నిందితులను అరెస్టు చేసి 24 కిలోల గంజాయితో పాటు, ఒక స్కూటీ, రూ.1,390 నగదు స్వాధీనం చేసుకున్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 28న వన్‌టౌన్ సీఐ, ఎస్‌ఐలు, రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేశారు. అనుమానాస్పదంగా ఉన్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు జువైనల్స్ ఉన్నారు. విజయనగరంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బేతా లల్లూ, బలిజవీధికి చెందిన తాలాడ దుర్గాప్రసాద్, పూల్‌బాగ్‌కు చెందిన పెనుగొండ తేజ స్వరూప్, తెలంగాణ రాష్ట్రం వరంగల్ క్రిస్టియన్ కాలనీకి చెందిన గడే సుమంత్ అలియాస్ చిన్ను, ఒడిశాలోని కోరాపూట్ జిల్లా సేపాయిపుట్టునకు చెందిన త్రినాథ్ కోరా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జాతవ్ జిల్లా సఫాయికి చెందిన సంతోష్ జాతవ్, అలియాస్ రాజగోపాల్ జాతవ్‌తో పాటు నలుగురు జువైనల్స్‌ను విచారించారు. వరంగల్‌కు చెందిన గడే సుమంత్, ఒడిశాకు చెందిన త్రినాథ్‌కోరా, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సంతోష్ జాతవ్ గంజాయిని ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి విజయనగరంలో ఉంటున్న బేతా లల్లూ, తాలాడ దుర్గాప్రసాద్, పెనుగొండ తేజ స్వరూప్‌లకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. వీరు చెడు వ్యసనాలకు అలవాటు పడి సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లను కూడా చోరీ చేస్తుంటారు. విజయనగరానికి చెందిన తాలాడ దుర్గాప్రసాద్‌పై ఇప్పటికే 12 క్రిమినల్ కేసులు ఉండడంతో హిస్టరీ షీట్ ఉంది. పూల్‌బాగ్‌కు చెందిన పెనుగొండ తేజ స్వరూప్‌పై 8 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఒకటో పోలీసు స్టేషన్ పరిధిలో మూడు మోటారు సైకిళ్లు, కేఎల్‌పురం వద్ద నిద్రిస్తున్న వారి వద్ద ఒక మొబైల్ ఫోన్ దొంగిలించారు. టూటౌన్ పోలీసు స్టేషన్, భీమిలి పోలీసు స్టేషన్ పరిధిలో రెండు మోటార్ సైకిళ్లు దొంగిలించినట్టు గుర్తించామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మొత్తం ఐదు మోటారు సైకిళ్లు, ఒక మొబైల్ ఫోన్‌ను వన్‌టౌన్ పోలీసులు రికవరీ చేశారని, నిందితులపై హిస్టరీ షీట్లు తెరవనున్నట్టు చెప్పారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ ఎస్ శ్రీనివాస్, ఎస్‌ఐలు నవీన్ పడాల్, హెచ్‌సీ అచ్చిరాజు, పీసీలు మణికంఠ, శ్రీనివాస్, శివ శంకర్, గౌరీశంకర్‌లను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాస్, విజయనాథ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ జిందాల్

మాదకద్రవ్యాల నివారణకు చర్యలు తీసుకోండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణ జరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురు వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం సరఫరా చేసేవారికి విధిగా శిక్షలు పడే విధంగా కట్టుదిట్టమైన ఆధారాలు సమకూర్చాలన్నారు. అటవీ ప్రాంతం గుండా జరిగే రవాణాకు అటవీశాఖ అడ్డుకట్ట వేయాలని సూచించారు. విద్యా సంస్థల వద్ద అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సారా విక్రయాలపై దృష్టిసారించాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలను రూపుమాపడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారాన్ని ప్రజలు అందించడానికి ప్రత్యేకంగా ఫోన్ నెంబర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు ఎస్పీ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ చట్టరీత్యా విద్యా సంస్థలకు మూడు వందల మీటర్ల దూరంలో సిగరెట్, మద్యం, మత్తు పదార్థాల వి క్రయం సరఫరా జరగరాదన్నారు. ఈ సమావేశంల ఏఎస్పీ సురాన అంకిత్‌మహావీర్, పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీవోలు హేమలత, వీవీ రమణ, జిల్లా అటవీ అధికారి ప్రసూన, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నమన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, హాజరైన ఎమ్మెల్యేలు

నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు

ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలపై దాడుల కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మ్యానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రతి కేసును పరిశీలించి, వివరాలు అడిగారు. కేసుల విచారణ పక్కాగా నిర్వహించి త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, పారిశుధ్యం, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిజానిజాలు తెలుసుకుని కేసులు పెట్టాలని, తప్పుడు కేసులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సురానా అంకితమహావీర్, డీఆర్‌వో జి.కేశవనాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్లనాయక్, కమిటీ సభ్యులు డి.శాంతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్‌లలో మంచినీటి ప్రాజెక్టులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: అమృత్ 2.0 పథకంలో భాగంగా ఇండ్ల లేఅవుట్‌లలో మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అమృత్ 2.0 పథకంపై నిర్వహించిన సమావేశంలో జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల పనులు, ప్రస్తుత పరిస్థితిపై పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. పైపులైన్‌లు లీకులు వస్తున్నాయని, నీరు వృథా అవుతుందన్నారు. అనువుకాని చోట్ల లేఅవుట్లు నిర్మాణాలు చేపట్టారని, నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. జిల్లా ప్రజారోగ్య ఇంజనీరింగ్ అధికారి నరసింగరావు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ లేఅవుట్‌లలో మంచినీటి సదుపాయం కల్పించడానికి అమృత్ 2.0 పథకం కింద పార్వతీపురం మున్సిపాలిటీకి రూ.5.02 కోట్లు, సాలూరు మున్సిపాలిటీకి రూ.3.20 కోట్లు, పాలకొండ నగర పంచాయతీకి రూ.2.16 కోట్లు విలువచేసే మంచినీటి పథకాలు మంజూరు అయ్యాయన్నారు.

డీలర్ పోస్టులను భర్తీ చేయండి

వేపాడ: జిల్లాలోని విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి డివిజన్లలో సుమారు 113 డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి జిల్లా అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో ఇన్‌చార్జిలతో నడిపిస్తున్నారు. దీని వల్ల గ్రామాల్లో రేషన్ పంపిణీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా అధికారులు తక్షణమే డీలర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి గాలి ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై డీఎస్‌ఓ మధును వివరణ కోరగా ఖాళీ పోస్టుల భర్తీకి మండల స్థాయిలో వివరాలు తీసుకుని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

నేడు వనమహోత్సవం

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం బూర్జవలస గ్రామంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు వనమహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమం సందర్భంగా పెద్దచెరువు గట్టుపై కొబ్బరి మొక్కలు నాటుతారన్నారు.

●**బొబ్బిలి:** నేడు ఉదయం 10 గంటలకు హరిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వనం-మనం కార్యక్రమం పురస్కరించుకొని బొబ్బిలి పురపాలక సంఘ కార్యాలయం నుంచి స్వామివారి వీధి మీదుగా రాణి మల్లమ్మ చెరువు గట్టు వరకు సైకిల్ ర్యాలీ అనంతరం చెరువు గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తారని కమిషనర్ రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పురప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేపాడ: బక్కునాయుడుపేట మెట్ట వద్ద గల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పట్నాయక్ తెలిపా రు.

1 నుంచి భవానీ దీక్షలు

రాజాం రూరల్: నవదుర్గ అమ్మవారి దేవస్థానంలో భవానీ మండల దీక్షలు సెప్టెంబరు 1 నుంచి ప్రారంభం కానున్నాయని ధర్మకర్త వానపల్లి నరసింగరావు తెలిపారు. 22 నుంచి అర్ధమండల దీక్షలు, అక్టోబరు 3 నుంచి నవరాత్రి దీక్షలు జరగనున్నాయని తెలిపారు. అక్టోబరు 12న నవదుర్గ అమ్మవారి నిజరూపాన్ని దర్శించుకునే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తామని వెల్లడించారు. ఈ ఏడాది నుంచి మాలధారణ ఉచితంగా చేపడుతున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా.. దేవస్థానానికి కార్యనిర్వాహణాధికారి లేకపోవడంతో పాలనాపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ఇక్కడి ఈవో కేశవరావును ఇటీవల ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడంతో ఇన్‌ఛార్జిగా ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయి ఈవోను నియమించాలని భక్తులు కోరుతున్నారు.

రేపు డీలర్ల సమావేశం

రామభద్రపురం: ఈ నెల 31న విజయనగరం జిల్లా డీలర్ల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ చొక్కాపు రామారావు తెలిపారు. పాత రిజిస్ట్రేషన్ ఆఫీసు దగ్గర సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

రోడ్లను పరిశీలించిన చైర్మన్

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో పాడైన రోడ్లను గురువారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు పరిశీలించారు. అమ్మిగారికోనేరు గట్టు వీధి ప్రధాన రోడ్డు పాడైపోవడంతో వర్షపునీరు, మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతోంది. దోమల బెడద, పారి శుధ్య సమస్య ఉంటోందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. జయప్రకాశ్ మున్సిపల్ పాఠశాల ముందు సీసీ రోడ్డు కు అంచనాలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు.

అర్చకుల వేతనం పెంపు హర్షణీయం

విజయనగరం రూరల్: రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల వేతనాలు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు పేరి రామయ్య పంతులు, ద్వాదశి వేణు, ధనాల వెంకటరావు చెప్పారు. బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో గురవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాన్ని రూ.15 వేలకు పెంచడం వల్ల అర్చకులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ధూప దీప నేవేద్యాలకు ఇచ్చే మొత్తం రూ.10 వేలకు పెంచడం, నిరుద్యోగ వేద విద్యార్థులకు నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వడానికి నిర్ణయించడం, ఆలయ కమిటీల్లో సభ్యులుగా అర్చకులకు స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణ విభాగం నాయకుడు ఇనుగంటి రాకేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రింగురోడ్డు: ఉడా సబ్‌స్టేషన్‌లో గల 11 కేవీ మహాలక్ష్మీనగర్ ఫీడర్ మీదున్న చెట్టుకొమ్మలు తొలగించటం, మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫార నిలిపివేస్తున్నామని ఈఈ హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉడా కాలనీ ఫేజ్ -1, 2, 3, 4, బొబ్బాదిపేట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన కోండ్రు

రాజాం: విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఎమెల్యే కోండ్రు మురళీ మోహన్ గురువారం కలిసి దుశ్శాలువతో ఘ నంగా సత్కరిం చారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు స్వగృ హంలో నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రం లోని ప్రధాన సమస్యలపై చర్చించారు. గత వైసీపీ పాలనలో యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లినట్టు కోండ్రు తెలిపారు.


లోకేష్‌తో కోండ్రు మురళీమోహన్

భూముల విషయంలో చర్యలు తీసుకోవాలి

రాజాం: గ్రామంలో ఇనాం భూముల వ్యవహారంలో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని, దీంతో రైతులు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈవిషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని శ్రీరాములు, భుజంగరావు, నారన్నా యుడు తదితరులు కోరారు. గురువారం గ్రామదర్శిని కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావుకు తమ సమస్యను వివరించారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు అన్నారు. అనంతరం గ్రామంలో పాఠశాలను, మధ్యాహ్న భోజనాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని, రేషన్ డిపోను సందర్శించారు. సీఎస్‌డీటీ చిరంజీవి, పొగిరి పీహెచ్‌సీ వైద్యులు గట్టి భార్గవి తదితరులు ఉన్నారు.


భోజన పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాఠశాల తనిఖీ

రేగిడి: అంబఖండి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో వరప్రసాదరావు తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఆరా తీశారు.

గౌరీశ్వరరావుకు అభినందన

రాజాం: ప్రకృతి వ్యవసాయం రైతు పెంకి గౌరీశ్వరరావును ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ శారదా జయలక్ష్మి దేవి గురువారం సత్కరించారు. రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన యాంత్రీకరణ మేళాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన మైసూర్ మల్లిక దేశవాళీ బియ్యం (బ్రౌన్ రైస్) అందజేశారు.

బోధనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టండి

జామి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నూతన ఒరవడితో కూడిన నైపుణ్య బోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 గంగరాజు కోరారు. గురువారం మండలంలోని కలగాడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం, వారికి పెడుతున్న మధ్యాహ్న భోజనాలు పరిశీలించారు.

కాలువల్లో చెత్త వేయవద్దు

రాజాం: మురుగు కాలువల్లో చెత్తను వేయవద్దని కమిషనర్ రామప్పలనాయుడు సూచించారు. గురువారం పురపాలక సంఘం పరిధిలోని బుచ్చింపేట గ్రామంలో పర్యటించారు. కాలువల్లో చెత్తను వేయడం వల్ల మురుగు నీరు నిల్వ ఉండిపోయి దోమలు ఈగలు చేరి, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి ఒక్కరు చెత్తను చెత్తబుట్టల్లో వేయాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్, వైద్య సిబ్బంది , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ నగర పర్యటన

రింగురోడ్డు: నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య గురువారం నగరంలోని పలు ప్రాంతాలను క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ముందుగా కంటోన్మెంట్ ప్రాంతంలోని మస్తరు పాయింట్ వద్దకు వెళ్లి సిబ్బంది హాజరు పట్టిక గమనించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది హాజరు అవుతున్నది లేనిది గమనించారు. గంటస్తంభం వద్దకు చేరుకుని అక్కడ ఉన్న పూల దుకాణాలను తక్షనమే వెనక్కి జరపాలన్నారు. అనంతరం కన్యాకా పరమేశ్వరి కోవెల వద్దగల రహదారిలో పల్లవిక్రయదారులతో మాట్లాడి రహదారికి ఇబ్బంది లేకుండా చేసుకోవాలన్నారు. అనంతరం ఘోషాసుపత్రి వద్ద ఏర్పాటు కానున్నా అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు పరిశీలించి పనులు వేగవంతం కావాలని ఆదేశించారు.

రింగురోడ్డు: నగరంలోని దాసన్నపేట వాటర్ ట్యాంక్ వద్ద వార్డుపర్యటనలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ తిరుమల రావు పర్యటించారు. పశుసంచారం ఎక్కువగా ఉండటంతో వ్యర్థాల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. అక్కడ నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిషరిస్తామన్నారు.

సైనిక పాఠశాల పరిశీలన

విజయనగరం టౌన్, ఆగస్టు 29: కోరుకొండ సైనిక పాఠశాలను సైనిక్ స్కూల్స్ సొసైటీ ఇన్‌స్పెకింగ్ అధికారి, కమోడోర్ రాజేష్ కుమార్ శర్మ గురువారం పరిశీలించారు. దేశవ్యాప్తంగా ఉన్న సైనిక పాఠశాలల్లో తనిఖీల్లో భాగంగా ఈ నెల 27 నుంచి 29 వరకు కోరుకొండ సైనిక పాఠశాలలో సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత విద్యా రంగంలో సైనిక పాఠశాలల విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించాలని అన్నారు. అనంతరం బాలికల వసతికోసం నూతనంగా నిర్మించిన శాతవాహన గృహ సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. పాఠశాల వార్తా లేఖ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి, సైనిక పాఠశాల అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


బాలికల వసతి గృహ సముదాయాన్ని ప్రారంభిస్తున్న రాజేష్ కుమార్ శర్మ

చిన్నశిర్లాంలో ఉత్కంఠకు తెర

● ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఏకగ్రీవ ఎన్నిక

రేగిడి: చిన్నశిర్లాం యూపీ పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక ప్రక్రియకు సంబంధించి ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. గత రెండు పర్యాయలు కోరం లేక, చిన్నపాటి ఘర్షణలతో ఎన్నిక వాయిదా పడింది. తాజాగా గురువారం నిర్వహించిన ఎన్నిక ప్రక్రియలో ఉత్కంఠ చోటుచేసుకుంది. ఒక పార్టీలో రెండు వర్గాల మధ్య వచ్చిన బేధాభిప్రాయాలు ఎన్నికకు దారి తీశాయి. ఒక వర్గం దూరం కావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. గతంలో ఎనిమిదో తరగతికి కోరం లేక చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక వాయిదా పడింది. తాజాగా కోరం ఉండడంతో సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక పూర్తి చేశారు. చైర్మన్‌గా పెంకి రమేష్, వైస్‌చైర్మన్‌గా గొట్టాపు పార్వతిని సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సంకిలి హైస్కూల్ హెచ్‌ఎం రామినాయుడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డులు

బొబ్బిలి రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం విజయనగరం జిల్లా హెడ్ క్వార్టర్‌లో గల రాజీవ్ ఇండోర్ స్టేడియంలో కలెక్టర్ అంబేడ్కర్ అధ్యక్షతన స్పోర్ట్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇటీవల సాఫ్ట్‌బాల్ సీనియర్ ఫెడరేషన్ కప్ లో బొబ్బిలి మండలం పారాది గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వారి మెమెంటో, సర్టిఫికేట్‌లను ప్రధానోపాధ్యాయులు బి నాగేశ్వరరావు.. కలెక్టర్ చేతుల మీదుగా తీసుకున్నారు.

25 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

బొబ్బిలి: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వచ్చేనెల 25 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్లు జేవీవీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక తాండ్రపాపారాయ మున్సిపల్ పాఠశాలలో గురువారం జేవీవీ నాయకులు శంబంగి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేవీవీ ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్ మాట్లాడుతూ వచ్చేనెల 25 న పాఠశాల స్థాయిలో, అక్టోబరు 1 న మండల స్థాయిలో, అక్టోబరు 27 న జిల్లా స్థాయిలో, నవంబరు 9,10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పధాన్ని అలవరిచేందుకు, వారిలో గల నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ సంబరాలు దోహదపడతాయన్నారు. శాస్త్ర విజ్ఞానం-చాటి ఫలితాలపై విద్యార్థులలో అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమణప్రభాత్, పి.సత్యంనాయుడు, జేవీవీ ప్రతినిధులు ఆనెం శ్రీనివాస్, కె.కృష్ణదాసు, రమణమూర్తి, శివశంకర్, రామకృష్ణ, ప్రసన్నకుమార్, మధుసూదనరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో ఎంపీడీవో సమావేశం

తెర్లాం, ఆగస్టు 29: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఉపాధిహామీ ఏపీవో, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. పర్సన్‌డేస్, పెండింగ్ డేస్ 7400లను ఈ రెండు వారాలలో పూర్తిచేయాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని పూర్తిచేయాలని సూచించారు. ఫారంపాండ్స్ నిర్మించాలని, లాండ్ బ్లాక్ ప్లాంటేషన్, రూఫ్ హార్‌వెస్టింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. అలాగే శుక్రవారం నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు.

మొక్కలు నాటిన జనసైనికులు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి కోరాడ వీధిలో గురువారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలలో భాగంగా 28వ వార్డ్ జనసైనికుల ఆధ్వ ర్యంలో క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రౌతు రామ్మూర్తి పాల్గొని ప్రారంభించారు. సుమారు 150 మొక్కలు ప్రతి ఇంటి ముందు, పాఠశాల ఆవరణలో, రోడ్లకు ఇరువైపులా నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణ కూడా చేయాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పువ్వల శ్రీను, మాజీ కౌన్సి లర్ సుంకర సాయి రమేష్, రఘు, గిరడ అప్పల స్వామి, పెద్దింటి మనోజ్ కుమార్, లంక రమేష్, పైల హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయి సమస్యల పరిశీలన

బొబ్బిలి: వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా గురువారం నాలుగో వార్డులో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, అధికారులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. దావాలవీధి, అంట్యాకుల వీధి, రేళ్లవీధి, బ్యాంకర్స్ కాలనీ తదితర ప్రాంతాలలో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు తదితర సమస్యలను స్థానికులు వివరించారు. కల్వర్టులు, కాలువలను నిర్మించాలని కోరడంతో టెండర్లు పిలిచినట్లు కమిషనర్ తెలిపారు. కుళాయిల్లో నీటిని నిర్దిష్టమైన వేళలను పాటించాలని మహిళలు కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి.. చిన్నారులతో కాసేపు గడిపారు. ఈ పర్యటనలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు పెద్దలు అమర్, మున్నా, పసుమర్తి గౌరు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనరు రామలక్ష్మి

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఉమ్మడి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. గురువారం జరిగిన ఈ ఘటనల్లో చేతికందివచ్చిన కుమారులు మృతి చెందడంతో కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి..

పాలకొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, ఎస్‌ఐ ప్రయోగమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వాబ గ్రామానికి చెందిన సవర ప్రభుదేవ్(19) పాలకొండ ఎన్.కె.రాజపురం గ్రామం వద్ద ఓ మెకానిక్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామమైన వాబకు బైక్‌పై వెళు తుండగా సిరికొండ రైస్‌మిల్లు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ఘట నలో తీవ్రంగా గాయపడిన ప్రభుదేవ్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందు కున్న ఎస్‌ఐ ప్రయోగమూర్తి పోలీసులతో ఘటనా స్థలానికి చేరకున్నాడు. మృతుడి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.


ప్రభుదేవ్ (ఫైల్)

డెంకాడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి డెంకాడ ఎస్‌ఐ సూరినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం చొల్లంగిపేట పంచాయతీ పోతియ్యపాలెం గ్రామానికి చెందిన కోరాడ సురేంద్ర(19) ఇంటి వద్దనే ఉంటూ తండ్రికి చేదోడు వాడుగా పనుల్లో సాయం చేస్తుంటాడు. బుధవారం సాయంత్రం తన తాతయ్య ఊరు బేతనాపల్లి వెళాడు. అక్కడి నుంచి గురువారం ఉదయం తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న గుణుపూరు సమీపానికి వచ్చేసరికి విజయనగరం నాత వలస ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఆగిఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు అకాలమరణం తండ్రి చినబంగారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


సురేంద్ర (ఫైల్)

వ్యాన్ నుంచి జారిపడి వ్యక్తి మృతి

కురుపాం రూరల్: వ్యాన్ నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం గవరంపేటకు చెందిన భోగిల సింహాచలం(47) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం పని నిమిత్తం గుమ్మలక్ష్మీపురం వెళ్లేందుకు కురుపాం నుంచి బొలెరో వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో గుమ్మగదబవలస వద్దకు వచ్చేసరికి వాహనం నుంచి సింహాచలం జారి కిందకు పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో తోటి కార్మికులు భద్రగిరిలోని పీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డుకు గాయాలు

భామిని: బత్తిలి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో గురువారం గాయాలపాలయ్యారు. గజపతినగరం సమీపంలో గుంతల వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ముందు ఉన్న కారును ఢీకొట్టాడు. దీనితో గాయాలపాలయ్యాడు. స్థానికులు భామిని పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

తైక్వాండో ఎగ్జామినర్‌గా వేణుగోపాలరావు

విజయనగరం టౌన్: తైక్వాండో అంతర్జాతీయ మాస్టర్, హోమ్ డాన్‌గా జిల్లాకు చెందిన రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు అర్హత సాధించారు. ఈ నెల 21 నుంచి 26 వరకు ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని కేల్గాం స్టేడియంలో 112వ అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్, 62వ పూండన్ ఎగ్జామినర్ కోర్స్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి వేణుగోపాలరావు, ఆయన కుమార్తె యశస్విని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ తైక్వాండో హెడ్ క్వార్టర్స్ అధికారి, చీఫ్ ఆఫ్ వరల్డ్ తైక్వాండో అకాడమీ గ్రాండ్ మాస్టర్ జై వన్ కాంగ్, ప్రపంచ తైక్వాండో మాస్టర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు, గ్రాండ్ మాస్టర్ కి హాంగ్ కిమ్ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో వేణుగోపాలరావు అంతర్జాతీయ మాస్టర్, హోమ్ డాన్‌గా అర్హత సాధించగా, ఆయన కుమార్తె యశస్విని మాస్టర్‌గా అర్హత సాధించారు. రాష్ట్రం నుంచి తండ్రి, కుమార్తెలు అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణమని తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గురాన అయ్యలు, చైర్మన్ కె.సుభాష్ చంద్రబోస్, అవనాపు విజయ్ అభినందనలు తెలిపారు.

వినాయక మందిరం ప్రారంభం

బొబ్బిలి: స్థానిక తూర్పు దేవిడి ఎదురుగా నూతనంగా నిర్మించిన వినాయక మందిరాన్ని ఎమ్మెల్యే బేబీనాయన గురువారం ప్రారంభించారు. ఇద్దుం సర్వేశు సొంత నిధులతో ఈ మందిరాన్ని నిర్మించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పురోహితులు చింతాడ కృష్ణాచారిని ఎమ్మెల్యే సత్కరించారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెబుదాం

● జిల్లా వ్యాప్తంగా వేడుకలు

● గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెబుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తెలుగు భాషా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలు నిర్వహించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థినీ విద్యార్థులు వివిధ సంప్రదాయ వేషధారణలో అలరించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



పాలకొండ: తలవరం ఉన్నత పాఠశాలలో..



కురుపాం: జడ్పీ ఉన్నత పాఠశాలలో..



భామిని: ఆదర్శ పాఠశాలలో ..



గరుగుబిల్లి: పరిశినాయుడు గోరుతో గీసిన తెలుగుతల్లి చిత్రం



బెలగాం: పార్వతీపురంలో తెలుగుతల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



సీతంపేట: ఐటీడీఏ కార్యాలయంలో..

ఘనంగా క్రీడా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పలుచోట్ల విద్యార్థులు వివిధ విన్యాసాలు ప్రదర్శించారు.



వీరఘట్టం: చిదిమి ప్రాథమికోన్నత పాఠశాలలో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



సీతంపేట: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల విన్యాసం



కురుపాం రూరల్: జి.శివడ ఆశ్రమ పాఠశాలలో..



మక్కువ: కేజీబీవీలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయినులు

క్రీడల్లో ప్రతిభ చాటాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే విజయచంద్ర



విలువిద్య పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో

బెలగాం: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలను వారు ప్రారంభించారు. భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించాలని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయాలని అన్నారు. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ పోటీల్లో కురుపాం నియోజకవర్గం ప్రథమ స్థానం, సాలూరు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. ఆర్చరీ పోటీల్లో కాంపౌండ్ బాలుర విభాగంలో పి.లోకేష్ ప్రథమ స్థానం, చేతన్ స్వరూప్ ద్వితీయ స్థానం సాధించారు. బాలికల విభాగంలో జి.తన్విక, జి.తనీషా, రికర్వ్ బాలుర విభాగంలో ఎ.కళ్యాణ్, ఎన్.జయంత్, బి.ఫణేంద్ర, రికర్వ్ బాలికల విభాగంలో పి.త్రివేణి, ఎన్.హేమన్య మొదటి, రెండో స్థానాల్లో నిలిచారు. ఇండియన్స్ బాలుర విభాగంలో డి.పవన్ కుమార్, దేవీప్రసాద్, బాలికల విభాగంలో ఎస్.అఖిల, బి.శ్రీప్రియలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జి.పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డీటీ గాంధీ, పీఈటీ ఎమ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలల జీతాలు చెల్లించండి

సీతానగరం (బలిజిపేట): తమకు ఇవ్వాల్సిన ఐదు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలంటూ స్కూళ్లలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ మేరకు ఎంఈవో-2 శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శానిటేషన్ వర్కర్ల సంఘ నాయకురాలు రాంబాయమ్మ మాట్లాడుతూ ఐదు నెలల నుంచి జీతాలు లేక చాలా అవస్థలు పడుతున్నామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని, పిల్లల ఆలనాపాలనా చూస్తున్న తమకు చాలీచాలని జీతాలు ఇస్తున్నారని అన్నారు. అవి కూడా గత ఐదు నెలల నుంచి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, తులసి, సీతమ్మ, లక్ష్మి, రాణి, అంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్లు సమంజసం కాదు

పాలకొండ: సుదూర ప్రాంతాలకు డిప్యుటేషన్ సరికాదని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు తండాడి అనీలకుమార్ అన్నారు. ఈ మేరకు పాలకొండ ఉపవిద్యాశాఖాధికారి పత్రి కృష్ణమూర్తికి గురువారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా అనీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న డివిజనల్ లెవెల్ వర్క్ ఎడ్జస్ట్మెంట్ వల్ల నూతనంగా ఏర్పడిన మన్యం జిల్లాలో పాలకొండ డివిజన్‌లో గిరిజన ప్రాంతాలు సుదూరంగా, ప్రయాణానికి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. పాలకొండ, సీతంపేట, వీరఘట్టం మండలాల నుంచి 80 కిలోమీటర్ల దూరం గుమ్మలక్ష్మీపురం మండలంలో పాఠశాలలకు డెప్యుటేషన్లతో పంపించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మానవీయ దృక్పథంతో సుదూర ప్రాంతాలకు డెప్యుటేషన్లు రద్దు చేయడానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఉపవిద్యాశాఖాధికారి హామీనిచ్చారు.

బుడ్డిపేటలో వైద్య శిబిరం

సీతానగరం: పెదబోగిలి పంచాయతీ బుడ్డిపేట గ్రామంలో సీతానగరం పీహెచ్‌సీ వైద్యురాలు ఉషారాణి గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో వైరల్ జ్వరాలతో బాధ పడుతున్నారన్న సమాచారంతో 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి కేసులు నమోదు కాలేదని ఆమె చెప్పారు. తాగునీటిని వేడి చేసి, చల్లారిన తరువాత తీసుకోవాలన్నారు. గ్రామంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

మూడు బ్లాక్ స్పాట్లు గుర్తింపు

సాలూరు రూరల్: రోడ్డు భద్రతకు సంబంధించి సాలూరు పట్టణంలో మూడు బ్లాక్ స్పాట్లను గుర్తించినట్టు సీఐ బి.అప్పలనాయుడు, ఎంవీఐ ఏవీఎస్ ప్రసాద్ తెలిపారు. రోడ్డు భద్రతపై గురువారం నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారులతో కలసి బ్లాక్‌స్పాట్లపై సర్వే చేశారు. ఈ మేరకు మామిడిపల్లి బస్టాప్ జంక్షన్, గాంధీనగర్, బైపాస్ రోడ్డు జంక్షన్లను ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశమున్న బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. ఆ ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించేందుకు సూచిక బోర్డులు పెట్టడానికి, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ, లైట్ పోల్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. అనంతరం హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

తోణాంలో 12 కొళాయి కనెక్షన్లు కట్

సాలూరు రూరల్: తోణాంలో 12 అనధికార కొళాయి కనెక్షన్లు కట్ చేసినట్టు సాలూరు ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి గురువారం చెప్పారు. రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశాల మేరకు ఈనెల 27న తోణాం వెళ్లి పరిశీలించినట్టు చెప్పారు. వాటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించామన్నారు. తోణాంలో 12 అనధికార కనెక్షన్లు తొలగించినట్టు నివేదిక ఇచ్చారని తెలిపారు. ఇదిలా ఉండగా... సామాజిక భద్రత పింఛన్లు ఈనెల 31న (శనివారం) పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) కె.గోపాలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని బెలగాం 11కేవీ పరిధిలోగల ఐటీడీఏ, గూడ్స్‌షెడ్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, పోస్టాఫీసు వీధి, ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు, మైదానం, అగ్రహం, నాయుడువీధుల తోపాటు బెలగాంలోని పలు వీధుల్లో విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తామని చెప్పారు. ఈ మేరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. **పాలకొండ:** నవగాం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టి.జి.కె.మూర్తి తెలిపారు. 30న ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నవగాం, పొట్లి, ఎం.సింగుపురం, మల్లివీడు, డోలమడ, బడ్డుమాసంగి, జంపరకోట, అవలంగి, పనుకు వలస, అట్టలి, తుమరాడ, చింతాడ, వాటపాగు, బెజ్జి, టీకేరాజపురం, టీడీపారాపురం, దుగ్గి, నక్కపేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. **గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులతో పాటు లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నారు. దీంతో గరుగుబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గొట్టివలస, మరుపెంట, ఉద్దవోలు, చినగుడబ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో నీటి ప్రవాహం నిలకడగా ఉంది. గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో నదిలోకి గురువారం ఎగువ నుంచి 1500 క్యూసెక్కులకు పైగా ప్రవాహం చేరుతోంది. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను ప్రస్తుతం 103.93 మీటర్ల మేర నీటి సామర్థ్యం ఉంది. ప్రధాన కాలువల నుంచి 1,420 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని డీఈ టి.రఘునాథనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్ తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవు

● ఎస్పీ మాధవ్‌రెడ్డి

గరుగుబిల్లి: పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకుంటే చర్యలు తప్పవని ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి హెచ్చరించారు. గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన విధులను విధిగా నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో అసత్వం వహించరాదన్నారు. రాత్రి సమయాల్లో దొంగతనాలకు ఆస్కారం లేకుండా ముమ్మరంగా పెట్రోలింగ్‌తో పాటు గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. నేరాల నియంత్రణకు దృష్టి సారించాలన్నారు. ప్రతి రోజు రెండు పూటలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, సారా అక్రమ రవాణాపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలన్నారు. మన్యం జిల్లా పరిధిలో నేరాల సంఖ్య అదుపులోకి వచ్చేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు నిర్వహణను పక్కాగా అమలుపర్చాలన్నారు. అనంతరం రిసెప్షన్ కేంద్రంతో పాటు రికార్డు గదులు, కంప్యూటర్ గది, స్వాధీనం చేసుకున్న పలు రకాల సామగ్రిని భద్రపర్చే గదులను నిశితంగా పరిశీలించారు. అలాగే సిబ్బందికి కేటాయించిన విధులు, పనితీరును తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో మండల ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, సిబ్బంది రాము, శంకరరావు, తదితరులు ఉన్నారు.



గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డు రూంను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

● **సీతానగరం (బలిజిపేట):** సీతానగరం, బలిజిపేట పోలీస్‌స్టేషన్లను మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆకస్మికంగా గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల వివరాలు, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ స్టేషన్ల రికార్డులతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ చేయడంతో పాటు గస్తీలు తిరిగి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

దశపర్ణి కషాయంతో ఉపయోగాలు

గరుగుబిల్లి: చీడపీడల నివారణకు దశపర్ణి కషాయం ఎంతగానో ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి సూచించారు. గురువారం వివిధ గ్రామాల్లో చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రేష్మ, స్వామినాయుడు, ఐసీఆర్పీ త్రినాథ, సింహాచలం, ఆరుద్ర తదితరులు పాల్గొన్నారు.

2న పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

మక్కువ: వచ్చే నెల 2వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నటు జనసేన సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల రిషివర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. మక్కువలో ఉచిత వైద్య శిబిరం, బైక్ ర్యాలీ, అన్నదానం, కేక్ కటింగ్, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, పాలు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు వెంపడాపు సుగుణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ పాఠశాలకు అవార్డు

గుమ్మలక్ష్మీపురం: కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం పార్వతీపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, శాసన సభ్యులు బి.విజయచంద్ర, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ఈ పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.చంద్రశేఖర్, హెచ్‌ఎంలు నాగరాజు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పురోహితునివలస పాఠశాలకు ..

సాలూరు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2023-24 విద్యా సంవత్సరంలో క్రీడల్లో ప్రతిభ చూపిన పాఠశాలలను ఎంపిక చేసి, అవార్డులు ప్రదానం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయచంద్ర చేతులమీదుగా పురోహితునివలస ఆదర్శ పాఠశాల పీడీ రవి అవార్డు అందుకున్నారు. డీఈవో పగడాలమ్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నుంచి అవార్డు అందుకుంటున్న పీడీ రవి

డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: డిగ్రీ విద్యార్థులకు రిజర్వ్‌బ్యాంక్(ఆర్‌బీఐ) ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆర్‌బీఐ స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ను గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఏ కళాశాల నుంచైనా విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. https//www.rbi90quiz.in వెబ్‌సైట్‌లో నమోదు కావాలని సూచించారు. విద్యార్థులు బృందంగా ఏర్పడి క్విజ్ పోటీల్లో నమోదు కావచ్చునన్నారు. బృందంలో కనీసం ఇద్దరు విద్యార్థుల ఉండాలన్నారు. పోటీలు స్టేట్‌రౌండ్, జోనల్ స్థాయి, జాతీయ స్థాయిలో మూడు స్థాయిల్లో జరుగుతాయన్నారు. జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ జేఎల్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లను సెప్టెంబరు 17వ తేదీలోపు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. దరఖాస్తు రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని డిగ్రీ చదివే విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శోభిక, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి దినేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కళాశాలల తనిఖీ

జియ్యమ్మవలస: కురుపాం, చినమేరంగి, గుమ్మలక్ష్మీపురం జూనియర్ కళాశాలలను జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈవో) మంజులావీణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. యూనిట్-2 పరీక్షలను ఆమె పరిశీలించారు. జిల్లాలో ఉన్న 14 ప్రభుత్వ, 34 ప్రైవేటు, కేజీబీవీలు, సోషల్ వెల్ఫేర్, మోడల్ స్కూళ్లలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. 8,748 ప్రథమ, 9,031 మంది ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఆమెతో పాటు లెక్చరర్లు వీకేజీ మహారాణా, శ్రీనివాసరావు, కల్పన, తేజేశ్వరరావు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవీఈవో

ఘనంగా క్రీడా దినోత్సవం

ఒడిశా

రాయగడ: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లా యంత్రాంగం రాయగడలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సద్భావన్ క్రీడాభవన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రోయిత్, సబ్‌కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవిలు హాజరయ్యారు. జెండా ఊపి క్రీడా ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో వివిధ విభాగాలకు చెందిన క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి నివాళులర్పించారు.

ఉత్తమ సామాజిక కార్యకర్తగా అమరేంద్రనాథ్

రాయగడ: దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌కు ఉత్తమ సామాజిక కార్యకర్తగా గౌరవం దక్కింది. ఒడిశా దైనిక్ ఖబర్ పాత్రికేయ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కటక్‌లోని సరళభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జాజ్‌పూర్ పార్లమెంటు సభ్యులు రబినారాయణ బెహరా, మండల విద్యాశాఖ కార్యాలయ కార్యదర్శి కైలాష్‌చంద్ర జెనా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేడు సీతంపేటలో కలెక్టర్ పర్యటన

సీతంపేట: మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ శుక్రవారం సీతంపేట మండలంలో పర్యటించనున్నట్టు ఐటీడీఏ పీవో వి.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేటలో ఏర్పాటు చేసిన గర్భిణుల వసతిగృహాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు.

విద్యార్థుల రక్తనమూనాల సేకరణ

పాలకొండ: పట్టణంలోని వెంకమ్మపేట ఎంపీయూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాలకొండ అర్బన్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శంకరరావు, ఆశ వర్కర్లు రాధ, మహాలక్ష్మి, శ్రీదేవి.. విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. జ్వరంతో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. హెచ్‌ఎం పరాంకుశంనాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మద్యం సీసాల ధ్వంసం

సీతానగరం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో 123 కేసులకు సంబంధించి 736 మద్యం సీసాలను గురువారం ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురానా, ఎస్ఐ ఎం.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

పాలకొండ: వచ్చేనెలకు సంబంధించి సామాజిక పింఛన్లు ఈనెల 31నే పంపిణీ చేయనున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. సెప్టెంబరు 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పంచాయతీలోని 9 సచివాలయాల పరిధిలో శనివారం పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా లబ్ధిదారులు 31న అందుబాటులో లేకపోతే సెప్టెంబరు 2న పింఛన్ అందిస్తామని తెలిపారు.

గంజాయిపై యువతకు అవగాహన

సీతంపేట: గంజాయి వాడకం వల్ల కలిగే దుష్ప్రభావంపై స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

గరుగుబిల్లి: రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు చెప్పారు. గురువారం గొట్టివలస, దళాయివలస ప్రాంతాల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాము, రవి, తదితరులు పాల్గొన్నారు.